క్లుప్తంగా

నూతన ఆటో స్టాండ్ల ఏర్పాటు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఆత్మకూరు బస్టాండ్, మూలాపేట సెంటర్లలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నూతన ఆటోస్టాండ్లను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కార్యదర్శి శంకర్‌కిశోర్ మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటుపై నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామన్నారు. ఇప్పటివరకు ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి సిరాజ్, ఏఐటీయూసీ, రైతు సంఘం, ఇన్సాఫ్, ఆటో కార్మిక సంఘం నాయకులు ఆంజనేయులు, షాన్‌వాజ్, సుబ్బరాయుడు, అజీజ్ అహ్మద్, మధు, ప్రసాద్, సునీల్, రెహమాన్, అంజయ్య, కొండయ్య, మునీష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య న్యాయవాదుల సమ్మేళనం



నెల్లూరు(లీగల్): స్థానిక అభిరామ్ హోటల్‌లో ఆర్యవైశ్య న్యాయవాదుల సమ్మేళనం ఆదివారం జరిగింది. తొలుత పొట్టిశ్రీరాములు చిత్రపటానికి వారు నివాళులర్పించారు. అనంతరం ఆర్యవైశ్య సీనియర్ న్యాయవాదులను సన్మానించారు. జిల్లా కోర్టు ప్రభుత్వ న్యాయవాది చుండూరు శ్రీహరి నారాయణ రావు, సీనియర్ న్యాయవాదులు వైవీ శేషయ్య, ఎం.కృష్ణ, ఎన్వీ ప్రసాద్, తట్టపర్తి వెంకటేశ్వర్లు, పచ్చిపులుసు శ్రీరాములు, చలువది వెంకటేశ్వర్లు, జూనియర్ ఆర్యవైశ్య న్యాయవాదులు పాల్గొన్నారు.

పులి వాహనంపై అమ్మవారు



ఇందుకూరుపేట: గంగపట్నంలోని చాముండేశ్వరిదేవి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం అమ్మవారికి పులివాహనోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఉభయకర్తలుగా స్థానిక పల్లిపాలెం గ్రామస్తులు వ్యవహరించారు.

విశ్వనాథస్వామి ఆలయానికి టేబుళ్ల బహూకరణ



మనుబోలు: స్థానిక రైల్వే గేటు సమీపంలో ఉన్న విశ్వనాథస్వామి ఆలయానికి రెండు టేబుళ్లను దాతలు కొండపల్లి శోభారాణి, శివకుమార్, హేమలత ఆదివారం బహూకరించారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసులు విశ్వనాథునికి విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



కోవూరు: మండల పరిధిలోని రామన్నగారిపాళెం గేటు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. వివరాలు.. కావలి నుంచి నెల్లూరు వైపునకు వస్తున్న కారు రామన్నగారి పాళెం గేటు సమీపంలో ముందు వెళ్తున్న టీవీఎస్ మోపెడ్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో టీవీఎస్ మోపెడ్‌పై ఉన్న భీమతాటి కేశవులుకు ఎడమకాలు, మెడపై తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని 108 వాహనంలో అపోలో వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంగనాథ్‌గౌడ్ తెలిపారు.

‘చెత్త’ నిర్వహణ

చెత్త తరలింపు పనులు చేస్తున్న కార్మికులు



- నిలిచిన ఈ–ఆటోలు
- తడి, పొడి చెత్త సేకరణకు ఆటంకం
- పట్టించుకోని అధికారులు



మరమ్మతులకు గురై మూలనపడిన చెత్త తరలించే ఆటోలు

నెల్లూరు(బారకాసు): క్లీన్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంటింటా చెత్త సేకరించేందుకు ఈ–ఆటోలు అందుబాటులోకి తెచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి నిర్వహణను గాలికి వదిలేసింది. ఫలితంగా నగరపాలక సంస్థ పరిధిలో అపరిశుభ్రత నెలకొంది. ఘన వ్యర్థాల నిర్వహణకు విఘాతం ఏర్పడుతోంది. తడి, పొడి చెత్తను వేరుగా సేకరించేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

చిత్తశుద్ధి ఏదీ?

కార్పొరేషన్ పరిధిలో మొత్తం 146 చెత్త తరలించే మినీ వాహనాలుండగా వాటి ద్వారానే తడి, పొడి చెత్తను విడిగా సేకరించేవారు. అందులో ప్రస్తుతం 50కు పైగా వాహనాలు మరమ్మతులకు గురై మూలనపడ్డాయి. మిగిలిన వాహనాలతో పాటు మరమ్మతులకు గురైన మినీ వాహనాల స్థానంలో ట్రాక్టర్లను అద్దెకు తీసుకొచ్చి చెత్తను తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో చిన్న సందుల్లో, వీధుల్లోకి ట్రాక్టర్లు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఇంటింటా చెత్త సేకరణకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పారిశుద్ధ్య సిబ్బంది ఇళ్ల నుంచి చెత్తను సేకరించి, పుష్‌కార్టుల ద్వారా తరలించి డంపర్ బిన్లలో వేస్తున్నారు. దీంతో తడి, పొడి చెత్త కలిసిపోతోంది. ఇది ఇలాగా కొనసాగితే స్వచ్ఛతకు భంగం వాటిల్లే ప్రమాదం ఉంది. గత ప్రభుత్వంలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే కార్యక్రమం సక్రమంగా నిర్వహించారు. స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా ఇంటింటికీ మూడు డస్ట్‌బిన్లను అందించి, వాటి ద్వారా తడి, పొడి, ప్రమాదకర చెత్తను విడిగా సేకరించేలా ప్రణాళికలు చేపట్టారు. చెత్తను విడదీసి ఇవ్వకపోతే తీసుకునేది లేదంటూ లౌడ్ స్పీకర్ల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారు. ప్రస్తుతం అలాంటిదేమీ కనిపించడం లేదు. ఫలితంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం లేకపోలేదు.

పట్టణ జనాభా	దాదాపు 9 లక్షలు
మొత్తం డివిజన్లు	54
వార్డు సచివాలయాలు	166
రోజూ ఉత్పత్తి అయ్యే చెత్త మెట్రిక్ టన్నులు	300
పారిశుద్ధ్య కార్మికులు	1,499
చెత్త తరలింపు వాహనాలు	160
మినీ వాహనాలు	70
ట్రాక్టర్లు	90

ఇబ్బందులు లేకుండా చేస్తున్నాం



ఈ–ఆటోలు గతంలో ఓ ఏజెన్సీ ద్వారా నడిచేవి. ప్రస్తుతం ఆ ఏజెన్సీ యాక్టివ్‌గా లేదు. ఆ బాధ్యత కార్పొరేషన్ చూడాల్సి వస్తోంది. మొత్తం 146 మినీ వాహనాల్లో ప్రస్తుతం 50కు పైగా మరమ్మతులకు గురయ్యాయి. వాటిని ఏజెన్సీ వారు తీసుకెళ్లారు. వాటి స్థానంలో 90 ట్రాక్టర్లను ఏర్పాటు చేసి వాటి ద్వారా చెత్త తరలింపు ప్రక్రియ జరుగుతోంది. దీంతో ప్రస్తుతం ఉన్న వాహనాలతోనే ఇబ్బందులు లేకుండా చెత్త తరలింపు చేపడుతున్నాం. చెత్త తరలింపు కోసం త్వరలో కొత్తగా వంద ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేయనున్నాం. తడి, పొడి చెత్తను వేరు చేసి సేకరించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– వైఓ నందన్, కమిషనర్, నగరపాలక సంస్థ

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వెంకటేశ్వరపురం సబ్‌స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వరపురం సెంటర్, మెయిన్‌రోడ్డు, విజయ డెయిరీ ప్రాంతం, నల్లకాలువ, పునరావాస కాలనీ, లక్ష్మీవీధి, అంబేడ్కర్ కాలనీ, ఇస్లాంపేట పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇంట్లో చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. ఇరుగాళమ్మ సంఘానికి చెందిన సాయికుమార్ తన కుటుంబంతో కలిసి ఈనెల 6వ తేదీన పెంచలకోనకు వెళ్లారు. ఈక్రమంలో గుర్తుతెలియని దుండగులు బెడ్‌రూమ్ కిటికీని పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాలోని 600 గ్రాముల వెండి వస్తువులను అపహరించుకుని వెళ్లారు. 7వ తేదీ ఇంటికి చేరుకున్న సాయికుమార్‌కు వెండి ఆభరణాలు కనిపించలేదు. చోరీ ఘటనపై బాధితుడు ఆదివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యోగాను అలవాటు చేయడమే లక్ష్యం



వృద్ధులతో కలిసి యోగాసనాలు చేస్తున్న కమిషనర్ నందన్

- కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): ప్రతిఒక్కరికీ యోగాను చేరువచేసి, మెరుగైన జీవన విధానాన్ని అలవాటు చేయడమే యోగాంధ్ర కార్యక్రమ ప్రధాన లక్ష్యమని నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు నందన్ తెలిపారు. యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం పొదలకూరు రోడ్డులోని రామచంద్ర మిషన్, నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం, చిల్డ్రన్స్ పార్క్ వద్ద నిర్వహించిన సీనియర్ సిటిజన్స్ సామూహిక యోగా కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. రామచంద్ర మిషన్ ఆశ్రమంలో నిర్వహించిన కార్యక్రమానికి కమిషనర్ నందన్ హాజరై యోగాసనాలు, ధ్యానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు స్థాయిలో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వయసుతో సంబంధం లేకుండా చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు కూడా యోగాను జీవన విధానంగా మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి యతిరాజ్, రామచంద్ర మిషన్ జోనల్ కో–ఆర్డినేటర్ గంగాధర్, యోగా గురువులు ప్రవీణలత, శ్రీనివాస్, రామచంద్ర మిషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీల ఎన్నిక



నెల్లూరు(వీఆర్సీ సెంటర్): నగరంలోని 11వ డివిజన్ ఎన్టీఆర్ నగర్, 16వ డివిజన్ గుర్రాలమడుగు సంఘం, 45వ డివిజన్ గచ్చుకాలువ సెంటర్ ప్రాంతాల్లో భవన నిర్మాణ కార్మికుల సర్వసభ్య సమావేశాలు ఆదివారం నిర్వహించి నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల పెంచలయ్య, శ్రీనివాసులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను వారి మేలు కోసం ఖర్చు చేయాలని తెలిపారు. జూలై 9న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పిట్ల సూర్యనారాయణ, సంపూర్ణమ్మ, శ్రీనివాసులు, మల్లికార్జున, సుబ్బారావు, మస్తానమ్మ, పద్మ, ఆనంద్, రవి పాల్గొన్నారు.

ఆనం వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఆనం దంపతులు

నెల్లూరు (వీఆర్సీ సెంటర్): నగరంలోని రామలింగాపురంలో మాజీ మంత్రి దివంగత ఆనం వెంకటరెడ్డి విగ్రహ పునః ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హాజరై, మాట్లాడుతూ నెల్లూరు రాజకీయ ముఖచిత్రంలో ఆనం వెంకటరెడ్డిది చెరగని ముద్ర అని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, ఇంటూరు నాగేశ్వరరావు, పాశం సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హాజరైన ఆనం దంపతులు

నెల్లూరు (పొగతోట): ఆనం వెంకటరెడ్డి విగ్రహ పునఃఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి హాజరయ్యారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

నెల్లూరు (వీఆర్సీసెంటర్): రూరల్ మండలంలోని కాకుపల్లి, మాదరాజుగూడూరు, పెనుబర్తి, కలివెలపాళెం గ్రామాల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో వారం రోజుల్లో తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ క్లబ్‌లో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. అపోలో హాస్పిటల్ డాక్టర్ రాజమోహన్‌రెడ్డి దీర్ఘకాలిక నొప్పులు, వ్యాయామ సంబంధిత పరిష్కారాలను వివరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేందర్‌రెడ్డి, సెక్రటరీ పొన్నం రవిచంద్ర, సభ్యులు డీవీ సుబ్బరాజు, స్వర్ణ రమేష్‌బాబు, కేఎంకే రెడ్డి, గోపాల్‌రెడ్డి, చంద్రమౌళి, ఖలీల్‌బేగ్, గఫార్ పాల్గొన్నారు.

సన్మానం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని హోటల్ శివమ్‌లో జిల్లా నూర్‌బాషా సంఘం ఆధ్వర్యంలో నూర్‌బాషా పెద్దలను ఆదివారం సన్మానించారు. సంఘ అధ్యక్షుడు సలీం పాల్గొని, మాట్లాడుతూ త్వరలో గడప గడపకు దూదేకుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్థోపెడిక్ డాక్టర్ మస్తాన్‌బాషా పాల్గొన్నారు.

ఆధునికీకరణ పనుల పరిశీలన



నెల్లూరు (టౌన్): నగరంలోని వీఆర్ హైస్కూల్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనులను రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశంలోనే బెస్ట్‌గా వీఆర్ హైస్కూల్‌ను తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. మరో వారంలో పనులను పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. మా కుమార్తె షరణి 20 కుటుంబాలను దత్తత తీసుకుంటుందన్నారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, కమిషనర్ నందన్, టీడీపీ నాయకులు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మామిడాల మధు, విజేతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రహస్యంగా సాగుతున్న పేకాట స్థావరాలపై పోలీసులు దాడి చేసిన ఘటన దేవరపాళెంలోని ఐఎంఎల్ డిపో వద్ద ఆదివారం చోటుచేసుకుంది. ముందస్తు సమాచారం మేరకు రూరల్ పోలీసులు ఆకస్మిక దాడులు చేసి ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారిని రూరల్ స్టేషన్‌కు తరలించి రూ.17,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రికెట్ పోటీలు



విజయం సాధించిన జర్నలిస్టు జట్టు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం జరిగిన క్రికెట్ పోటీల్లో జర్నలిస్టు జిల్లా జట్టు విజయం సాధించింది. జిల్లా జర్నలిస్ట్, రెవెన్యూ సిబ్బందికి ఆటవిడుపుగా క్రికెట్ పోటీలు ఆదివారం జరిగాయి. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రెవెన్యూ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 104 పరుగులు సాధించింది. అనంతరం 105 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగిన జర్నలిస్టు జట్టు 14.5 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. జే శాప్ రాష్ట్ర కార్యదర్శి నరేష్, జిల్లా నేతలు కిశోర్, సునీల్, కమ్రుద్దీన్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు అభినందన



ఆర్థిక సాయం అందజేస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులతో రాష్ట్ర ప్రతిభా అవార్డును పొందిన యాకసిరి మహితను గిరిజన విద్యా చైతన్య వేదిక ఆధ్వర్యంలో అభినందించారు. చైతన్య వేదిక వ్యవస్థాపకుడు పులి చెంచయ్య ఆధ్వర్యంలో నగరంలోని అపోలో ఆస్పత్రి పక్కన యాకసిరి ప్రసాద్, లలిత గృహంలో జరిగిన కార్యక్రమంలో గిరిజన విద్యార్థిని మహిత ఇంటర్‌లో 964 మార్కులను సీఈసీ గ్రూపులో సాధించడం అభినందనీయమని ఐటీడీఏ పూర్వ పీఓ వెంకటేశ్వర్లు అన్నారు. ఈ క్రమంలో చిన్నారికి ఆర్థిక సాయంతో పాటు దుస్తులను అందజేశారు. స్కూల్ అసిస్టెంట్ మానికల జయలక్ష్మమ్మ, ఆదిత్య జూనియర్ కళాశాల సీఈఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

- నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏపీ ఎంసెట్‌లో రాష్ట్రస్థాయిలో 24వ ర్యాంకు సాధించిన రేవూరు నిషితను విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ఆదివారం అభినందించారు. నగరంలోని ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఇంట్లో జరిగిన కార్యక్రమంలో కొండ్రెడ్డి మాట్లాడుతూ ఉన్నత చదువుల్లో రాణించాలని ఆకాంక్షించారు.



నిషితను అభినందిస్తున్న కొండ్రెడ్డి

ఏపీఈఏపీ సెట్‌లో నారాయణ సత్తా

నెల్లూరు (టౌన్): ఏపీ ఈఏపీ సెట్‌లో నారాయణ ఐఐటీ అకాడమీ విద్యార్థులు సత్తా చాటారని నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. స్థానిక హరనాథపురంలోని నారాయణ ఐఐటీ అకాడమీలో ప్రతిభ చూపిన విద్యార్థులను ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో కె.పూర్వజ్ 84వ ర్యాంకు, హేమంత్‌సాయి 90, ఆశ్రిత 105, మధుకిరణ్‌రెడ్డి 135, హితేష్ అభిషేక్ 242, సాయిసాత్వికర్ 291, భానురిషిక్ 302, కృష్ణకౌషిక్ 450, హర్షవర్ధన్ 492వ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. 100లోపు ఇద్దరు, 500లోపు 8 మంది, వెయ్యిలోపు 11 మంది ర్యాంకులు సాధించారన్నారు. అగ్రికల్చర్ విభాగంలో కవిన్ 24వ ర్యాంకు, ప్రణీత్ కల్యాణ్ 116, నిఖిల 170, శ్రీహాస్ 171వ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. 100లోపు ఒకరు, 500లోపు 18 మంది, వెయ్యిలోపు 28 మంది ర్యాంకులు సాధించారన్నారు.

ఘనంగా రెడ్డి సంఘ వార్షికోత్సవం





- ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగర నియోజకవర్గ రెడ్డి సంక్షేమ సంఘ ప్రథమ వార్షికోత్సవాన్ని నగరంలోని రామ్మూర్తినగర్ పద్మావతి కల్యాణ మండపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన ప్రముఖ రెడ్డి నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆయన సతీమణి సంధ్యారాణి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. అనంతరం నగరానికి చెందిన ఏఆర్ హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి రక్త, బీపీ, ఎంఆర్ఐ పరీక్షలతో పాటు, కంటి, ఆర్థో వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సంఘ సభ్యులు ధనుంజయరెడ్డి, వెంకురెడ్డి, తనుజారెడ్డి, వెంగళరెడ్డి, రామ్‌ప్రసాద్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, శనివారపు రాజగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శ్రీహరిరెడ్డి, ఏఆర్ వైద్యశాల అధినేత నిచ్చల్‌ప్రసాద్‌రెడ్డి, వైద్యులు నిఖిలారెడ్డి, సర్వజ్ఞరెడ్డి పాల్గొన్నారు.